క్లుప్తంగా

పాడి అభివృద్ధికి శ్రద్ధ తీసుకోవాలి



ఉండవెల్లి: పాడి అభివృద్ధికి రైతుల శ్రద్ధ తీసుకోవాలని పశువైద్యాధికారి శిరీష అన్నారు. మండలంలోని బైరాపురం గ్రామంలో గురువారం ఉచిత పశువైద్య శిబిరంలో భాగంగా గర్భకోశ వ్యాధి చికిత్స అందించారు. పాడి రైతులు సరైన పోషకాహారం, బలమైన దినుసులతో ధాన్యాన్ని తయారు చేసి అందించాలని సూచించారు. కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ శివ, కృష్ణ, గోపాలమిత్ర సవరయ్య, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా శివస్వాముల మెట్లపూజ



గట్టు: మండల పరిధిలోని బల్గెర గ్రామంలో గురువారం శివస్వాములు మెట్ల పూజ ఘనంగా నిర్వహించారు. మాజీ జెడ్పీటీసీ బాసు శ్యామల, బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకుడు బల్గెర హనుమంతునాయుడు దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో శివస్వాములు, భక్తులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి



ఉండవెల్లి: పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని మండల పరిధిలోని పంచాయతీ కార్యదర్శులు ఎంపీడీఓ తిరుపతన్నకు గురువారం వినతిపత్రం అందజేశారు. గతేడాది బిల్లులు ఇంకా విడుదల కాలేదని తెలిపారు. నిధులు లేకుండా ఎలాంటి ఆర్థిక పనులు చేపట్టబోమని సంఘం ఆధ్వర్యంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

ఉండవెల్లి: మండలంలోని తుంగభద్ర నుంచి అలంపూర్ చౌరస్తాలోని ప్రకృతి నగర్‌కు అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను బ్లూకోర్టు పోలీసులు పట్టుకున్నట్లు ఎస్ఐ మహేష్ తెలిపారు. గురువారం కర్నూల్‌కు చెందిన టిప్పర్ డ్రైవర్ ప్రతాప్ నాయుడు అక్రమంగా ఇసుక తరలిస్తుండగా పోలీసులు పట్టుకుని టిప్పర్ యజమాని లక్ష్మన్న, డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

రాజోళి: భారత్‌మాల రోడ్డు పనులకు వినియోగిస్తున్న టిప్పర్ ఢీకొట్టడంతో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు ఎస్ఐ జగదీశ్ తెలిపారు. బుధవారం కర్నూల్ జిల్లా ఎదురూరు గ్రామానికి చెందిన చాకలి దుబ్బన్న(73)ను రాజోళి సమీపంలోని భారతమాలలో బ్రిడ్జి దగ్గర టిప్పర్ ఢీకొట్టిన విషయం తెలిసిందే. చికిత్స నిమిత్తం కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా గురువారం మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడి కుమారుడు మద్దిలేటి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆలయంలో హుండీ చోరీ

వనపర్తి రూరల్: జిల్లా కేంద్రంలోని మున్సిపాలిటీ పక్కన ఉన్న అభయ ఆంజనేయస్వామి ఆలయంలో గుర్తు తెలియని వ్యక్తులు హుండీని పగులగొట్టి చోరీ చేసిన ఘటన బుధవారం రాత్రి చోటుచేసుకుంది. పట్టణ ఎస్ఐ హరిప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం రాత్రి మున్సిపాలిటీ పక్కన ఉన్న అభయ ఆంజనేయస్వామి ఆలయానికి పూజారి శ్రీహరి తాళం వెళ్లిపోయాడు. గురువారం ఉదయం వచ్చి చూసే సరికి గేట్లు తెరుచుకొని ఉండటం గమనించిన పూజారి ఆలయ చైర్మన్ రామచంద్రారెడ్డికి ఫోన్ చేసి చెప్పడంతో.. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు క్లూస్‌టీం తో ఆధారాలు సేకరించారు. హుండీలో ఉన్న సుమారు రూ.20 వేలు దొంగలు ఎత్తుకెళ్లినట్లు పూజారి చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ పేర్కొన్నారు.

సమస్యలతో విద్యార్థుల సతమతం

- చాలీచాలని భోజనం
- మరుగుదొడ్ల కోసం పోరాటం
- సీసీ కెమెరాల ఊసేలేదు
- బసకు తప్పని కష్టాలు

ఎర్రవల్లి: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం పుట్టెడు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోంది. పాఠశాలలో మొత్తం 232 మంది విద్యార్థులు ఉండగా 5 తరగతి గదులు, 5 డార్మిటరీలు, 10 మరుగుదొడ్లు, 10 స్నానపు గదులు మాత్రమే ఉండటంతో బాలికలు అరకొర వసతులతో నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలలో 232 మంది విద్యార్థులు ఉండగా ప్రభుత్వం నుంచి కేవలం 200 మంది విద్యార్థులకు మాత్రమే దుస్తులు, నోట్ పుస్తకాలు, స్టైఫండ్, తదితర వసతులు అందుతుండటంతో మిగిలిన 32 మంది ఇబ్బందులు పడుతున్నారు. డార్మిటరీల్లో బస చేసేందుకు నిత్యం ఇబ్బందులు పడుతున్నట్లు విద్యార్థులు వాపోయారు. ప్రభుత్వం 200 మంది విద్యార్థులకు మాత్రమే వసతిని అందించడంతో వారికి వండిన ఆహారంలోనే మిగిలిన 32 మందికి సర్దేస్తున్నట్లు బాలికలు వాపోతున్నారు.



బాలికలు బస చేస్తున్న డార్మిటరీ గది

విషసర్పాల సంచారం..

పాఠశాల చుట్టూ పంట పొలాలు, కోరి గుంత ఉండటం, ప్రహరీ లేకపోవడంతో విషసర్పాలు సంచరిస్తున్నట్లు బాలికలు పేర్కొన్నారు. క్రీడా స్థలం కూడా లేకపోవడంతో క్వారీ గుంత దగ్గరే ఆటలు ఆడుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందంటున్నారు. అధికారులకు, ప్రజా ప్రతినిధులకు సమస్యలు విన్నవించినా ఏమాత్రం పట్టించుకోలేదని బాలికలు, వారి తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.



ఎర్రవల్లి కస్తూర్బా పాఠశాల భవనం

సీసీ కెమెరాల ఊసేలేదు...

పాఠశాలకు చుట్టూ ప్రహరీ సక్రమంగా లేకపోవడం, సీసీ కెమెరాలు కూడా ఏర్పాటు చేయకపోవడంతో ముఖ్యంగా రాత్రి వేళల్లో ఇబ్బందిగా ఉంటుందని విద్యార్థులు వాపోతున్నారు. పాఠశాల ఎర్రవల్లి కూడలికి దాదాపు 2కిలో మీటర్ల దూరంలో ఉండటం వల్ల మందు బాబులతో ఇబ్బందులు పడుతున్నట్లు పేర్కొన్నారు.

బస కోసం పోరాటమే..

డార్మిటరీల్లో రాత్రి వేళ బస చేసేందుకు నిత్యం పోరాటం చేయాల్సిన వస్తుందని బాలికలు వాపోతున్నారు. ప్రతి డార్మిటరీలో కేవలం 20 మంది విద్యార్థులు మాత్రమే బస చేసేందుకు స్థలం ఉంటుంది. కానీ పరిమితికి మించి 40 మంది బాలికలు ఉండటం వల్ల పడుకునేందుకు ఇబ్బంది పడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో కలెక్టర్‌తో పాటు ఉన్నతాధికారులు పాఠశాలను సందర్శించి సమస్యలు పరిష్కరిస్తామని చెప్పడం మాటలకే పరిమితమైందని వాపోతున్నారు.



పాఠశాల ఆవరణలో ఉన్న క్వారీగుంత

నిత్యం ఇబ్బందులు..



పాఠశాలలో తరగతి గదులు, డార్మిటరీలు, మరుగుదొడ్లు, స్నానపు గదులు తక్కువగా ఉండటంతో నిత్యం ఇబ్బందులు పడుతున్నాం. ప్రతిరోజు కాల కృత్యాలు తీర్చుకోవాలన్నా గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి ఉంది. అదనపు గదులు ఏర్పాటు చేసి విద్యాలయంలో విద్యార్థులు పడుతున్న ఇబ్బందులు తొలగించాలి. – లావణ్య, విద్యార్థి, 8వ తరగతి

వసతులు కల్పించాలి..



విద్యాలయంలో మొత్తం 232 మంది విద్యార్థులు ఉండగా ప్రభుత్వం నుంచి 200 మంది విద్యార్థులకే పుస్తకాలు, బట్టలు, నోట్ పుస్తకాలు అందుతున్నాయి. మిగిలిన వారికి వసతులు అందడం లేదు. భోజనం కూడా చాలీచాలకుండానే అందుతుంది. క్రీడా స్థలం కూడా లేదు. అధికారులు స్పందించి విద్యార్థులందరికీ వసతులు కల్పించాలి. – జయలక్ష్మి, విద్యార్థి, 7వ తరగతి

ఉన్నతాధికారులకు విన్నవించాం..

పాఠశాలకు ప్రహరీ ఏర్పాటు చేసి ఎదుట ఉన్న కోరీ గుంతను పూడ్చాలని పలు మార్లు ఉన్నతాధికారులతో పాటు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం. కానీ సమస్య నేటికి పరిష్కారం కాలేదు. అదనపు గదులు, మరుగుదొడ్ల ఏర్పాటుపై అధికారులకు విన్నవించాం. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం. –ఆసియాబేగం, ప్రత్యేక అధికారి, ఎర్రవల్లి కేజీబీవీ

ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

మల్దకల్: ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. రూ.60 లక్షల వ్యయంతో చేపడుతున్న రోడ్డు పనులు నాణ్యతగా చేపట్టాలని సూచించారు. అదే విధంగా ఆదిశిలా క్షేత్రంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యేకు ఆలయ నిర్వాహకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న బస్టాండ్ స్థల సమస్య కోర్టు తీర్పుతో పరిష్కారమైందని ప్రజలు హర్షం వ్యక్తం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, రాజారెడ్డి, సత్యారెడ్డి, విక్రమసింహారెడ్డి, పటేల్ ప్రభాకర్ రెడ్డి, నర్సింహ్మారెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, నరేందర్, నారాయణ, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా యజ్ఞకుండల మహారుద్రయాగం



జింకలపల్లిలో మహారుద్రయాగంలో శివస్వాములు

ఎర్రవల్లి: మండల పరిధిలోని జింకలపల్లి శివాలయంలో గురువారం ఏకాదశ యజ్ఞ కుండల మహారుద్రయాగాన్ని అర్చకులు ఘనంగా నిర్వహించారు. సుధా పండితులు రవీంద్ర సింహాచార్యుల ఆధ్వర్యంలో ఆలయంలో గోపూజ, గణపతి హోమం, నవగ్రహ దేవతా హోమం, మహారుద్ర యాగం వంటి ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు కుంకుమార్చనలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. స్వామి వారి ఊరేగింపు కన్నులపండువగా జరగగా నందికోళ్ల సేవా కార్యక్రమాలు ఉత్సాహంగా జరిగాయి. చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

శివ నామస్మరణాలతో మార్మోగిన ఆలయం

ఉండవెల్లి: మండల కేంద్రంలోని మణికంఠ అయ్యప్ప స్వామి ఆలయంలోని రామలింగేశ్వర స్వామి ఆలయంలో గురువారం స్వామివారికి పంచామృతాభిషేకాలు నిర్వహించి, ప్రత్యేక పూజలు చేశా రు. శివ మాలాధారులు ఇరుముడి ధరించి శ్రీశైలానికి పాదయాత్రగా బయలుదేరారు. కార్యక్రమంలో అర్చకులు ఆంజనేయ శర్మ, ఆలయ ధర్మకర్త దామోదర్ రెడ్డి, శివ మాలాధారులు, భక్తులు పాల్గొన్నారు.



జింకలపల్లిలో ఉత్సాహంగా నందికోళ్ల సేవ ఆడుతున్న భక్తులు

శివస్వాములకు అన్నదానం..

మానవపాడు: మండలంలోని అమరవాయి గ్రామంలో జిల్లా డీసీసీ కార్యదర్శి మహ్మద్ సిరాజ్ అహ్మద్ ఆధ్వర్యంలో 100 మంది శివస్వాములకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో శివస్వాములు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు



మాట్లాడుతున్న రామలింగేశ్వరగౌడ్

అయిజ: వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని స్పెషల్ ఆఫీసర్ రామలింగేశ్వర గౌడ్ అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్పెషల్ ఆఫీసర్ మాట్లాడుతూ.. తాగునీటి సమస్యలున్న గ్రామాలను గుర్తించి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తాగునీటి వనరులను ముందుగానే గుర్తించి వాటి ద్వారా గ్రామానికి తాగునీటి సరఫరా చేసేందుకు ప్రణాళిక తయారు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటయ్య, ఏఈఈ సందీప్ రెడ్డి, పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయాలి

మల్దకల్: విద్యార్థుల్లో దాగిఉన్న సృజనాత్మకతను వెలికితీయాలని జీహెచ్ఎం నరేష్ సూచించారు. గురువారం అమరవాయి కాంప్లెక్స్ పరిధిలోని ప్రాథమిక స్థాయిలో ప్రతిభా ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలలకు చెందిన విద్యార్థులకు మౌఖిక, పఠన, చిత్రలేఖన, క్విజ్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు జీహెచ్ఎం బహుమతులు ప్రదానం చేశారు. ప్రధానోపాధ్యాయులు నర్సింహస్వామి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై అవగాహన



ఇంటి నమూన చేపడుతున్న అధికారులు

మానవపాడు: మండల కేంద్రంలో ఎంపీడీఓ భాస్కర్ ఆధ్వర్యంలో ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో గురువారం ఇందిరమ్మ ఇళ్ల మోడల్ హౌస్ మార్క్ విధానం నమూనా రూపొందించారు. ఈ సందర్భంగా రూ.5లక్షల వ్యయంతో నిర్మాణం పూర్తి చేయొచ్చని లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చేయూత



విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేస్తున్న అశోక్

అయిజ: మండలంలోని ఉప్పల క్యాంపులో గురువారం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు దాత అశోక్ విద్యా సామగ్రి అందజేశారు. ఈసందర్భంగా పాఠశాల హెచ్ఎం మాట్లాడారు. జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం సాధించిన సందర్భంగా విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, కంపాక్స్ బాక్సులు, పెన్సిళ్లు, పెన్నులు, నోట్ బుక్స్ అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ



ఉపాధ్యాయులతో విద్యార్థులు

గద్వాలటౌన్: పట్టణంలోని ప్రభుత్వ బాలురు ఉన్నత పాఠశాలలో గురువారం స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు బోధన చేశారు. ఈ సందర్భంగా ఉత్తమ బోధన చేసిన విద్యార్థులకు హెచ్ఎం ఇమ్మానేయుల్ బహుమతులు అందజేశారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు సందడి చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సరైన పోషకాహారంతోనే ఆరోగ్యం

గట్టు: సరైన ఆహారాన్ని తీసుకోవడం ద్వారానే ఆరోగ్యంగా ఉండవచ్చని ఇన్‌చార్జి ఏపీఎం జయాకర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని మహిళా సమాఖ్యలో ఆరోగ్యం, ఆహారం, లింగ వివక్షత, పోషణపై మహిళా సంఘాల లీడర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం జయాకర్ మాట్లాడుతూ.. కుటుంబ నిర్వహణలో మహిళ పాత్ర ముఖ్యమని, మహిళలు సరైన పోషకాలు కల్గిన ఆహారాన్ని తీసుకోవడం ద్వారా ఆరోగ్యాని కాపాడుకోవచ్చని పేర్కొన్నారు. లింగ వివక్షత చూపించకూడదన్నారు. బాల్య వివాహాలు అరికట్టాలన్నారు. కార్యక్రమంలో సీసీలు ఆంజనేయులు, రామకృష్ణ, దేవదాసు, జ్యోతి, శివ కుమార్, గ్రామ సంఘ లీడర్లు పాల్గొన్నారు.



గ్రామ సంఘ లీడర్లకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

రోడ్డు సిబ్బంది నిర్లక్ష్యాన్ని వీడాలి..



సిబ్బందిని నిలదీస్తున్న బీజేపీ నాయకులు

రాజోళి: భారత్‌మాల రోడ్డు నిర్మాణం చేపడుతున్న సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండల బీజేపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం బీజేపి నాయకులు భారత్ మాల క్యాంప్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. బుధవారం భారత్‌మాల రహదారికి చెందిన టిప్పర్ ఢీకొని కర్నూల్ జిల్లాకు చెందిన వ్యక్తికి తీవ్రగాయాలు కావడంతో ఆయన పరిస్థితి విషమంగా ఉంది. ఈ నేపథ్యంలో బీజేపీ నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బీజేపీ సీనియర్ నాయకులు సంఘాల సంజీవ రెడ్డి మాట్లాడుతూ.. టిప్పర్లు, లారీలు, ఇతర వాహనాలు మితిమీరిన వేగంతో వెళ్తున్నాయని, ప్రధాన రోడ్లపై భారత్ మాల పనులు జరుగుతున్న దగ్గర కనీసం సూచిక బోర్డులు, సెక్యూరిటీ సిబ్బంది లేకపోవడం ఏంటని వారు ప్రశ్నించారు. ఈ సందర్భంగా భారత్ మాలకు సంబంధించిన వాహనాలు నిలిపేశారు. కార్యక్రమంలో తిరుమలేష్, రాజేష్, గోవిందు రాజులు, రాజు, చిన్నప్ప తదిదరులు పాల్గొన్నారు.

ఎల్ఐసీలో ఉద్యోగాలు భర్తీ చేయాలి

గద్వాలన్యూటౌన్: ఎల్ఐసీలో ఉద్యోగాలు భర్తీ చేయాలని ఐసీఈయూ గద్వాల బ్రాంచ్ ప్రధాన కార్యదర్శి బంగి రంగారావు డిమాండ్ చేశారు. స్థానిక ఎల్ఐసీ కార్యాలయ ఆవరణలో గురువారం గంట పాటు విధులు బహిష్కరించి సమ్మె నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 2012 నుంచి ఇప్పటి వరకు క్లాస్–3, క్లాస్–4 ఉద్యోగాల నియామకాలు చేపట్టలేదని ఆరోపించారు. 2017 నుంచి 2024 వరకు 15వేల మంది ఉద్యోగులు పదవీ విరమణ పొందినట్లు తెలిపారు. దేశ వ్యాప్తంగా 42 కోట్ల మంది పాలసీదారులు ఉన్నారని, వీరికి 30 వేల మంది ఉద్యోగులు ఎలా సర్వీస్ అందిస్తారని ప్రశ్నించారు. ఉన్న ఉద్యోగులు మానసిక ఒత్తిడికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ఉద్యోగ భర్తీ ప్రక్రియ ఆరంభించాలని మేనేజ్‌మెంట్‌ను డిమాండ్ చేశారు. ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ యూనియన్ గుర్తింపు లేకపోవడం వల్ల అధికారికంగా చర్చలు జరగడం లేదన్నారు. 2012లో నియామకమైన ఉద్యోగులందరికీ ఓల్డ్ పెన్షన్ సౌకర్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు సూరజ్, పద్మావతి, శివశంకర్, రంగయ్య, చంద్రశేఖర్, మల్లికార్జున్, నర్సింగ్, కృష్ణచైతన్య, శైలేష్, లక్ష్మీకాంత్, ప్రవీణ్, సుదర్శన్, అమరేందర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బంగి రంగారావు

టీఎల్ఎం పద్ధతిలో సులభతరమైన విద్య



జూలెకల్‌లో మాట్లాడుతున్న ఎంఈఓ నరసింహ

శాంతినగర్: చదువులో వెనకబడ్డ విద్యార్థులకు టీఎల్ఎం పద్ధతి ద్వారా సులభతరమైన విద్య అందించవచ్చని ఎంఈఓ నరసింహ అన్నారు. వడ్డేపల్లి మండల పరిధిలోని యూపీఎస్ జూలెకల్‌లో మండల విద్యాశాఖ, ఎంవీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సబ్జెక్ట్ మేళా గురువారం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయురాలు పుష్పలత అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంఈఓ, ఎంపీడీఓ రామకృష్ణ హాజరయ్యారు. విద్యార్థులు 70 రకాల టీఎల్ఎంలు తయారుచేసి వివరించడం ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంవీ ఫౌండేషన్ మండల కోఆర్డినేటర్ హనిమిరెడ్డి, క్లస్టర్ జీహెచ్ఎం అన్వర్ ఉల్‌హక్, ఏపీ చైర్మెన్ స్రవంతి, ప్రధానోపాధ్యాయులు తేజనాయక్, బాబు, మురళీధర్‌గౌడ్, యాదయ్య, సీఆర్‌పీఎఫ్ సభ్యులు వెంకట్రాముడు, పరమేష్, బడేసాబ్, వెంకటేష్, సుధాకర్, శశికళ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంవీఎఫ్ ఆధ్వర్యంలో సబ్జెక్ట్ మేళా

కేటీదొడ్డి: వినూత్న బోధన చేపట్టేందుకు సబ్జెక్ట్ మేళా ఎంతో దోహదపడుతుందని హెచ్ఎం భాస్కర్ అన్నారు. మండలంలోని చింతలకుంట పాఠశాలలో గురువారం ఎంవీఎఫ్, విద్యాశాఖ ఆధ్వర్యంలో తెలుగు, గణితం సామాన్య శాస్త్రం, ఇంగ్లిష్ సబ్జెక్టుల వారీగా సబ్జెక్ట్ మేళా నిర్వహించారు. కార్యక్రమంలో ఎంవీఎఫ్ కోఆర్డినేటర్ సాయికుమార్, కిరణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్, యూపీఎస్‌కు వ్యతిరేకంగా యుద్ధభేరి



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయ సంఘం నాయకులు

మానవపాడు: సీపీఎస్, యూపీఎస్‌కు వ్యతిరేకంగా మార్చి 2న హైదరాబాద్‌లో నిర్వహించనున్న యుద్ధభేరి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యలయంలో ఎంపీడీఓ భాస్కర్ ఆధ్వర్యంలో వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం నూతన పెన్షన్ స్కీమ్ రద్దు చేయకుండా దాని స్థానంలో యూనిఫైడ్ స్కీమ్‌ను తీసుకురావడాన్ని టీఎస్‌సీపీఎస్ఈయూ ఖండిస్తుందన్నారు. సీపీఎస్ విధానంలో రిటైర్డ్ అయిన ఉద్యోగులకు పెన్షన్ రూ.2500 నుంచి రూ.5వేల వరకు మాత్రమే వస్తుందని, లోపభూయిష్టమైన యూపీఎస్, సీపీఎస్ విధానాలు రద్దు చేసి దాని స్థానంలో పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు వెంకటకృష్ణారెడ్డి, సురేష్, నరేందర్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్, జయమ్మ, శ్రీధర్‌రెడ్డి, మంజుల, మేరి, నిరంజన్‌రెడ్డి, ప్రభావతి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయానికి నోచుకోని అమరచింత

- మున్సిపాలిటీగా మారినా తెరుచుకోని వైనం

అమరచింత: పట్టణంలో కొన్నేళ్లుగా గ్రంథాలయం మూతపడి ఉన్నా మున్సిపల్ అధికారులు, పాలక మండలి పట్టించుకోవడం లేదు. పట్టణంలో గ్రంథాలయ నిర్వహణ కోసం జెడ్పీ ఉన్నత పాఠశాలలోని గదిని కేటాయించినా నిర్వహణ భారంతో మూతపడింది. కనీసం దినపత్రికలు చదవాలనుకున్న వయోజనులు మూతపడిన గ్రంథాలయం ఎన్నడు తెరుస్తారో అని ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. గతంలో అమరచింత గ్రామంగా ఉన్నప్పుడు కొంతమంది యువకులు స్వచ్ఛందంగా గ్రంథాలయం పునరుద్ధరణ కోసం విరాళాలు సేకరించి ప్రతి నెల దినపత్రికలతో పాటు విజ్ఞానానికి సంబంధించిన పుస్తకాలు అందుబాటులో ఉంచారు. దాతల సహకారంతో కుర్చీలు, బెంచీలు ఏర్పాటు చేసి నెలసరి వీటిని నిర్వహించే వ్యక్తికి గౌరవ వేతనం ఇచ్చే వీలును కల్పించారు. ప్రస్తుతం దాతలు ముందుకు రాకపోవడంతో నిర్వహణ భారమై గ్రంథాలయం మూతపడింది. మున్సిపాలిటీగా మారిన తర్వాత గ్రంథాలయానికి పూర్వవైభవం వస్తుందని ఆశించిన ప్రజలకు నిరాశే మిగిలింది. ప్రస్తుతం గ్రంథాలయానికి కేటాయించిన భవనం తలుపులకు వేసి ఉన్న తాళాలు పగిలిపోవడంతో భవనంలో ఫర్నీచర్‌కు రక్షణ కరువైంది. ఇప్పటికైనా మున్సిపల్ పాలక వర్గం స్పందించి గ్రంథాలయ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



నిరుపయోగంగా గంథ్రాలయ భవనం